

మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి చామకూర మల్లారెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి.

గోప్యంపై గరం.. గరం

మైనార్టీ, బీసీ, దళిత బంధు లబ్ధిదారుల ఎంపికపై స్పష్టత కరువు

- అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై సభ్యుల రసాభాస
- అక్రమ కట్టడాలు, కూల్చివేతలు, వేధింపులు, ఇంటి నంబర్లపై ఆగ్రహం
- జిల్లా పరిషత్ సభలో వాడీవేడీ చర్చ

సాక్షి, మేడ్చల్ జిల్లా: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక గోప్యతపై పలువురు సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత, మైనార్టీ, బీసీ బంధు పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కొందరి ప్రజాప్రతినిధుల ఒత్తిడి, సిఫారసుల మేరకే సాగుతుందని ఆరోపించారు. మంగళవారం మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ హాలులో చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సభలో మంత్రి చామకూర మల్లారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) అభిషేక్ ఆగస్త్య, జెడ్పీ సీఈఓ దేవసహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. సభలో ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దళిత బంధు లబ్ధిదారుల ఎంపికలో దళారుల ప్రమేయం ఉంటోందని, కొందరు దళారులు దళిత బంధు ఇప్పిస్తామని దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో మంత్రి, ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతలు సిఫారసు చేసిన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. మైనార్టీ బంధు ఎంపిక గోప్యంపై ఎంపీపీ రజిత తీవ్రంగా ధ్వజమెత్తారు. ఏ పద్ధతిన ఎంపిక చేశారో తెలపాలని పట్టుబట్టారు. బీసీ బంధు లబ్ధిదారుల ఎంపికలో కూడా గందరగోళం నెలకొందని పలువురు సభ్యులు విమర్శించారు. ఈ విషయమై జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ పథకాల్లో లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం జారీ చేసిన మార్గకాలను సభ్యులకు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం, పలువురి అధికార పార్టీ సభ్యులు, ఘట్‌కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయంలో చైర్మన్ జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

అక్రమ కట్టడాలపై..

పురపాలక సంఘానికి సమీపంలో ఉన్న చీర్యాల, కీసర, గోధుమకుంట గ్రామాల్లో అక్రమంగా నిర్మించుకున్న పేదల ఇళ్లను ఫెనాల్టీతో రెగ్యులరైజ్ చేసి, ఇంటి నంబర్లు కేటాయించాలని జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం సభలో కోరారు. మరో సభ్యురాలు ఎల్లుబాయి మాట్లాడుతూ పేదల ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు బడాబాబుల జోలికి వెళ్లడం లేదని, బొమ్మరాసుపేటలో కొనసాగుతున్న అక్రమ కట్టడాలను ప్రస్తావించారు. ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఏదులాబాద్‌లో ప్రజల నుంచి వసూలు చేసిన రూ.50 లక్షల పన్నులు దర్వినియోగమైనా.. చర్యలు తీసుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, జోరుగా సాగుతున్న అక్రమ కట్టడాలను అరికట్టలేకపోతున్నారని, దీనికి ప్రధానం కారణం అవినీతి, అక్రమాలేనని ఆరోపించారు. ఈ విషయంపై చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ పేదలు నిర్మించుకున్న ఇళ్లను రెగ్యులరైజ్ చేయడంపై ఒక కమిటీని వేసి.. తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభ్యురాలు శైలజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా గ్రంథాలయాల భవనాల నిర్మాణం, రీడింగ్ రూమ్‌లను రూ.4 కోట్లతో చేపట్టామని, మరో రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి వివరించారు.





సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య తదితరులు

ప్రజల సంక్షేమానికి నిరంతరం పని చేస్తున్నాం

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి మల్లారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: పేదల సంక్షేమం, అభ్యున్నతికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి ఆర్థిక అభివృద్ధికి పరితపిస్తుంటారని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను దేశంలో ప్రవేశపెడుతున్నారని, ఇది ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి అధ్యక్షతన జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో) దేవసహాయం, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న సమావేశంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే నిరుపేదలకు గృహలక్ష్మీ పథకం కింద రూ.3 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందన్నారు. జిల్లాలో ఈ నెల 26 వరకు ప్రతి నియోజకవర్గంలో మూడు వేల మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.3 లక్షలకు సంబంధించిన గృహలక్ష్మీ చెక్కులను అందజేస్తామని తెలిపారు. రెండో విడతలో కూడా ప్రతి నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మీ పథకం వర్తింపజేస్తామన్నారు. దళితబంధు పథకం రెండో విడతలో ప్రతి నియోజకవర్గంలో 1,100 మంది చొప్పున అర్హులైన వారికి లబ్ధి కల్పిస్తామన్నారు. బీసీ, మైనారిటీ బంధు కింద రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు.



అభివృద్ధి ఘనత మాదే: జెడ్పీ చైర్మన్

పల్లెలు, పట్టణాల్లో పరిశుభ్రత, పచ్చదనం, పార్కులు, రోడ్లు వంటి అభివృద్ధి పనుల ఘనత తమ ప్రభుత్వానిదేనని, ఇదంతా సీఎం కేసీఆర్ తోనే సాధ్యమైందని జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి, సమన్వయం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ బేస్త వెంకటేశం, సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఇందిర, ఎల్లుబాయి, రజిత, శైలజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ 33/11కేవీలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఘట్‌కేసర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం కలుగుతుందని ఏఈ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. సాయిరాంనగర్, బ్రూక్‌బాండ్, బుగ్గానగర్, అంబేడ్కర్ నగర్, టీచర్స్ కాలనీ, కుమ్మరిబస్తీలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నేడు మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బుధవారం మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధి అర్కల్ గూడ, సుతారిగూడలో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



రెండో రోజు పూజల్లో భక్తులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి, శ్రీషిర్డీ సాయిబాబా దేవస్థానం శ్రీఅభయాంజనేయస్వామి, శ్రీపోచమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవ పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు పూజా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం దేవాలయంలో పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మున్సిపల్ కౌన్సిలర్ అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, దేవాలయ శాశ్వత చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, అధ్యక్షుడు నిరంజన్‌బాబు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

23 నుంచి జోనల్ స్థాయి క్రీడాపోటీలు



కీసర: జిల్లా క్రీడల సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జోనల్ స్థాయి క్రీడా పోటీలను(కీసర, కాప్రా) ఈనెల 23, 23, 28వ తేదీల్లో కీసర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కీసర జోనల్ సెక్రటరీ బి.యాదయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కీసర జోనల్ పరిధిలోని కీసర, కాప్రా ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనవచ్చన్నారు. అండర్–14, అండర్–17, రెండు విభాగాల్లో క్రీడాపోటీలను నిర్వహిస్తామన్నారు. 23న వాలీబాల్, 24న కబడ్డీ, 28న ఖో–ఖో, క్రీడా పోటీల్లో నిర్వహిస్తామన్నారు.

ఓటును వినియోగించుకోవాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి సూచించారు. జిల్లాలో ఎంతో చైతన్యం కలిగి ఉన్న వయోవృద్ధులు ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు స్వీప్ ప్రచారంలో భాగంగా సీనియర్ సిటిజెన్స్‌కు అవగాహన సమావేశం నిర్వహించారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేస్తూ పలు సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని ఆయన గుర్తుచేశారు. 80 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటును వినియోగించుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ఇంటి నుంచి ఓటు వేయాలనుకున్న వారు ఎన్నికల ప్రకటన వెలువడిన మీదట నిర్ణీత ఫారం నింపి తమ అభ్యర్థనను తెలియజేస్తే, పోలింగ్ అధికారి నేతృత్వంలోని సిబ్బంది వారి ఇంటి వద్దకు వచ్చి సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ ఓటును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. వయోవృద్ధుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చెయిర్ వంటి సదుపాయాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేశారు. పలువురు సీనియర్ సిటిజెన్స్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాసమూర్తి, ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీలింగ్ భూమిలో అక్రమ లేఅవుట్‌పై ఫిర్యాదు



సదరు స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు(ఫైల్)



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంకిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ మహేష్ తదితరులు

కీసర: అంకిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 780(బీ)లోని రెండెకరాల సీలింగ్ భూమిలో అక్రమంగా లేఅవుట్ చేస్తున్నారని సదరు సీలింగ్ భూమిని పరిరక్షించాలని కోరుతూ మంగళవారం అంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ కొల్కూరి మహేష్‌తోపాటు పలువురు గ్రామస్తులు కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కొల్కూరి మహేష్ తదితరులు మాట్లాడుతూ నగరానికి చెందిన ఓ వ్యక్తి సీలింగ్ భూమిని రైతుల అవసరాలను ఆసరా చేసుకొని డబ్బు ఆశ చూపి నిబంధనలకు విరుద్ధంగా సీలింగ్ భూమిని కొనుగోలు చేసి అందులో లేఅవుట్ ఏర్పాటు చేసి రహదారులు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాడన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీలింగ్ భూమిని వ్యవసాయానికి మాత్రమే ఉపయోగించాలని నిబంధన ఉన్నప్పటికీ సదరు రియల్టర్ అక్రమ లేఅవుట్ చేసి అమాయకులకు విక్రయిస్తున్నాడని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే సీలింగ్ భూమిలో వెలసిన విద్యుత్ స్తంభాలు, రోడ్లు తొలగించి ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు.

రామలింగేశ్వర స్వామి ఆశీర్వచనాలు



కీసర: బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ అభ్యర్థిగా మంత్రి చామకూర మల్లారెడ్డి పేరును సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం వేద పండితులు ఆయన నివాసానికి తరలివెళ్లి మంత్రి మల్లారెడ్డి దంపతులకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు మహాప్రసాదాన్ని అందజేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఆలయ చైర్మన్ తటాకం రమేష్, ఈఓ నాగేందర్, బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బెలిదే రమేష్‌గుప్తా, మచ్చాని జంగయ్యయాదవ్, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యులు, రాగుల రమేష్, రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

అధికారుల డుమ్మాపై సీరియస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: జెడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశానికి జిల్లాస్థాయి అధికారులు డుమ్మా కొట్టడంపై జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే జెడ్పీ సమావేశానికి కూడా రాకపోవడం ఏంటని, నివేదిక చదివేందుకు వచ్చిన పలువురి కిందిస్థాయి అధికారులను ఆయన ప్రశ్నించారు. ఎలాంటి అనుమతి తీసుకోకుండా సమావేశానికి హాజరుకాని జిల్లాస్థాయి అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జెడ్పీ సీఈఓకు చైర్మన్ ఆదేశాలు ఇచ్చారు.

ఆరె కటిక సంఘం భవనానికి స్థలం కేటాయించాలి



అవుషాపూర్ సర్పంచ్‌కు వినతి అందజేస్తున్న అరెకటిక సంఘం సభ్యులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో సూర్యవంశీ ఆరె కటిక సంక్షేమ సంఘం భవనానికి స్థలం కేటాయించాలని గ్రామంలోని ఆరె కటికలు సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డికి స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో ఆరె కటిక సంఘం భవనం కోసం స్థలం కేటాయించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, దశరథ, కిషన్, పరమేశ్, సత్యనారాయణ, జగదీశ్, ఉమామహేశ్, రాజారాం, నవీన్, ప్రవీణ్, సాయినాథ్, రఘుకులేశ్ పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితులకు రిమాండ్

జవహర్‌నగర్: దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలాజీనగర్ శివాజీనగర్‌కు చెందిన కట్ట సందీప్, సుక్కమ్మ బస్తీకు చెందిన తన్నీరు రాజు దొంగతనాలకు పాల్పడుతున్నారు. వారం రోజుల క్రితం వెంకటేశ్వరకాలనీ, చంద్రపురి కాలనీలో రెండు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారు. మంగళవారం ఉదయం జవహర్‌నగర్ పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగిలించిన సొమ్మును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

కీసర సర్పంచ్ అవమానిస్తున్నారంటూ నిరసన

కీసర: కీసర గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యుడైన తనను కీసర సర్పంచ్ నాయకపు మాధురి పలు అధికారిక కార్యక్రమాల్లో అవమానించే విధంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ 2వ వార్డు సభ్యుడు రామారం ప్రదీప్, తన తల్లి మాజీ ఎంపీపీ రామారం సుజాతతో కలిసి మంగళవారం కీసర అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వివిధ అధికారిక కార్యక్రమాల్లో సర్పంచ్ నాయకపు మాధురి తమను అవమానించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కీసరలో లబ్ధిదారులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పంపిణీ సందర్భంగా డ్రాలో లక్కీ నెంబర్ కుడా తనతో తీయించకుండా అడ్డుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిరసన చేపడుతామన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న కీసర పోలీసులు ధర్నాకు దిగిన మాజీ ఎంపీపీ సుజాతతో పాటు వార్డు సభ్యుడు రామారం ప్రదీప్‌తో మాట్లాడి ధర్నా విరమింపజేశారు. అనంతరం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కీసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

14మందితో గౌరవంగా మాట్లాడుతున్నా..

తాను ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదని, కీసర సర్పంచ్‌గా తాను పంచాయతీకి చెందిన 14 మంది వార్డు సభ్యులతో గౌరవంగానే మాట్లాడటం జరుగుతుందని, ఎవరినీ కులం పరంగా అవమానించలేదని కీసర సర్పంచ్ నాయకపు మాధురి తెలిపారు. అధికారిక కార్యక్రమాలకు సంబంధించి పంచాయతీ సిబ్బందితో వార్డుసభ్యులకు సమాచారం అందించడం జరుగుతుందన్నారు. కీసరలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లక్కీ డ్రాకు సంబందించిన విషయంలో గ్రామసర్పంచ్‌గా తాను లబ్ధిదారుల లక్కీడ్రాలు తీశానన్నారు.



కీసర అంబేడ్కర్ చౌరస్తా వద్ద ధర్నా

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఇంటింటికీ కాంగ్రెస్



ఘట్‌కేసర్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో సింధుజ, సంజీవరెడ్డి, శివప్రదీప్‌రెడ్డి

ఘట్‌కేసర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మున్సిపాలిటీలోని ఐదో వార్డులో మున్సిపల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యూత్ కాంగ్రెస్ నేషనల్ కో ఆర్డినేటర్, తమిళనాడు కార్యదర్శి సింధుజ, తెలంగాణ యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి రుక్‌వర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సుశాంత్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శివప్రదీప్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, రాబోయే రోజుల్లో చేపట్టనున్న పనులపై ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముత్యాలుయాదవ్, ఆంజనేయులు యాదవ్, నర్సింగ్‌రావు, గణేశ్‌నాయక్, కార్తీక్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్‌కుమార్, బద్రీ, సురేశ్, మల్లేశ్, సునిల్, ప్రశాంత్, అశ్రఫ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మండలంలోని ప్రతాపసింగారం, కాచవానిసింగారంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను తహసీల్దార్ కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కూల్చివేయించారు. ఘట్‌కేసర్‌లోని సర్వే నంబర్–153లో అక్రమంగా నిర్మించిన మూడు ఇళ్లు, 117లో 10 గుడిసెలు, ప్రతాపసింగారం సర్వే నంబర్–52లో మూడు ఇళ్లు, కాచవానిసింగారం సర్వే నంబర్–66లో నిర్మించిన మూడు ఇళ్లను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చెరువులు, కాల్వలు, కుంటలు ఆక్రమించి ప్రభుత్వ భూమిలో కట్టడాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



మొక్కల పంపిణీ

మేడ్చల్: పట్టణంలోని వివిధ వార్డుల్లో కౌన్సిలర్లు మొక్కలను పంపిణీ చేశారు. అందరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీ కాలనీలో కౌన్సిలర్ నర్సింహస్వామి యాదవ్ మొక్కలను అందజేశారు.



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో హరితహారం



విజ్ఞాన్ కళాశాలలో మొక్కలు నాటుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ హేమలత

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం హరితహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ, స్థానిక కౌన్సిలర్ హేమలత హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటడం సంతోషంగా ఉందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, జంగయ్యయాదవ్, ప్రిన్సిపల్ అప్పారావు నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

మేడ్చల్: మంత్రి మల్లారెడ్డికి మేడ్చల్ బీఆర్ఎస్ టికెట్ ఖరారు కావడంతో బీఆర్ఎస్ నాయకులు మేడ్చల్‌లో సంబురాలు జరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు మంత్రి మల్లారెడ్డికి స్వాగతం పలకగా ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు టపాసులు పేల్చి మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. మంత్రి ఇంటి వద్ద మండల, మున్సిపాలిటీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మంత్రి దంపతులను సన్మానించారు.

పుష్పగుచ్ఛం అందజేసి..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, మండలంలోని గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు ఉదయాన్నే మంత్రి మల్లారెడ్డి నివాసానికి తరలివెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామాల్లో బాణాసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుకున్నారు.

అభినందనలు

ఘట్‌కేసర్: మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం మంత్రి మల్లారెడ్డికి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కౌన్సిలర్లు శశికళ, మల్లేశ్, రవీందర్, జహంగీర్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్, జంగయ్యయాదవ్, నర్సింగ్‌రావు, రాజు, మహంకాళీ, మురళి, సందీప్, నిఖిల్ పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కండ్లకోయ నాయకులు



మేడ్చల్‌లో బీఆర్ఎస్ నేతల సంబురాలు



మంత్రి ఇంటి వద్ద..



మంత్రికి అభినందనలు తెలుపుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్